

'భగత్‌సింగ్ ట్యూషన్ విద్యార్థులు

జూపార్క్‌లో 'కేరింత'

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

విద్యతో పాటు వినోదం, విజ్ఞానం అందించడమే లక్ష్యంగా సుందరయ్య నగర్‌లో భగత్‌సింగ్ ఉచిత ట్యూషన్ సెంటర్ నడుస్తోంది. క్రిస్మస్ సెలవును పురస్కరించుకుని బుధవారం విద్యార్థులను జూపార్కుకు తీసుకెళ్లినట్లు నిర్వాహకులు జయచంద్ర, సాయిలక్ష్మి, నరేంద్ర తెలిపారు. విద్యార్థులకు జంతువులను చూపించి, వాటి గురించి వివరించారు. దీంతో విద్యార్థులకు వైజ్ఞానికంగా ఎంతో ఉపయోగపడింది.

తిరుపతిలో...

పుత్తూరులో...

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎన్డీయే కూటమి ప్రభుత్వం క్రిష్టియన్ల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని కేబి లేఅవుట్‌లో ఉన్న షెకీనా మినిస్ట్రీస్ చర్చ్, వెస్ట్ చర్చ్ లలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆరణి శ్రీనివాసులు పాల్గొని కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. జీసస్ చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన కోరారు. అసూయ, ద్వేషాన్ని వీడి ప్రజలు సామరస్యంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా చర్చిల నిర్మాణం, పునరుద్ధరణకు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, మురళీనాథ్ రెడ్డి, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, చందు, వెంకటేశ్, వన్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం అయ్యంగార్, జానకి రామ్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

పుత్తూరు టౌన్ : ఎన్జీవో కాలనీలోని చర్చిలో పాస్టర్ సెల్వం అధ్యక్షతన పేద మహిళలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోకె.విజయ్‌కుమార్, కె.జీవన్‌బాబు, జోష్, ఐజాక్, బాబు పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో... బీసీ కాలనీలోని ప్రార్థనా మందిరంలో పాస్టర్ వెంకీ ఆధ్వర్యంలో క్రిస్‌మస్ వేడుక నిర్వహించారు. సూళ్లూరుపేటకు చెందిన దైవసేవకులు రెవరెండ్ శాంతిబాబు పాల్గొన్నారు. అనంతరం క్రైస్తవులకు అన్నదానం చేశారు. వృద్ధులకు, వికలాంగులకు బట్టలు పంపిణీ చేశారు. జితేంద్రనాయుడు, మంగారావు, కోటి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో... వడమాలపేట హెబ్రోన్‌చర్చిలో నగరి ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు జాన వెంకటయ్య, ఉమాపతి పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో.. ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ నివాసంలో ప్రముఖపారిశ్రామికవేత్త కొండా లక్ష్మీ నారాయణ కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండా భాస్కర్, రాజేంద్రప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

సిఐటియు ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలని, ప్రైవేటీకరణ జరగకుండా ప్రతి ఒక్కరూ ఐక్యతగా అడ్డుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. బుధవారం పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ చేసి ప్రజలపై భారాలు మోపడానికి కుట్రపన్నారని ఆరోపించారు. ప్రధాని మోడీ చండీగర్ రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టారన్నారు. వారికి సంఘీభావంగా సిఐటియు దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగిస్తుందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు 16 వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపారని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదానీకి ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను బిగించకుండా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ రాష్ట్రాల హక్కులను కాల రాస్తున్నారని, విద్యుత్ ప్రైవేటీకరణతో రైతులకు ఉచిత విద్యుత్తు భవిష్యత్తులో ఉంటుందో పోతుందో తెలియదన్నారు. అలాగే పరిశ్రమలకూ పెను ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకోవడానికి విద్యుత్ ఉద్యోగులు, రైతు సంఘాలు , వినియోగదారులు, వామపక్ష పార్టీలు పోరాట ఫలితంగా పార్లమెంట్లో విద్యుత్ సాధన చట్టాన్ని గత పది సంవత్సరాలుగా చేయలేకపోయిందని గుర్తు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రహ్మణ్యం, నాయకులు టి సుబ్రహ్మణ్యం, ఎస్.జయచంద్ర, ఆర్ లక్ష్మి, గండికోట నాగ వెంకటేష్, సిపిఎం నగర కార్యదర్శి పి.వేణు, బుజ్జమ్మ, ఎన్ డి శ్రీను పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడ..

రోడ్లన్నీ గుంతలమయం

ఆదాయం లేదని వంకలు

కేరాఫ్ గుంతల జాడ..

సంక్రాంతికి ఎక్కడెక్కడో ఉండే బంధుమిత్రులంతా సొంతూళ్లకు వెళుతుంటారు.. ఎక్కడా కూడా గుంత ఉంది, ప్రయాణం ఇబ్బంది అయింది అనే కంప్లైంట్‌రాకూడదు.. సంక్రాంతి లోపు గుంతలన్నీ పూడ్చాలి.. స్థానిక ఎంఎల్ఎలదే ఈ బాధ్యత. అని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుని తాజా హుకుం ఇది.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రేణిగుంట పారిశ్రామికవాడ.. కేరాఫ్ గుంతల జాడగా మారింది.. ఏ రోడ్డు చూసినా గుంతలమయం.. పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలే ఈ రోడ్లపైకి వస్తుంటాయి. అయితే గుంతలమయమైన రోడ్లలో ఈ వాహన రాకపోకలు ప్రమాదకరంగా మారాయి.. వర్షం వచ్చిందంటే రోడ్లు వంకలను తలపిస్తున్నాయి. ఎపిఐఐసి అధికారులను ఈ విషయమూ వివరణ కోరగా ఆదాయం లేని కారణంగా ఏమీ చేయలేకపోతున్నామని చెప్పడం గమనార్హం.

రేణిగుంట పారిశ్రామికవాడలో 130 పరిశ్రమలు ఉన్నాయి. దాదాపు పది రహదారులు, 18 సందులు ఉన్నాయి. ఒకప్పట్లో పారిశ్రామికవాడ తారురోడ్లతో కళకళలాడేది. ప్రస్తుతం కళావిహీనంగా మారింది. రోడ్లన్నీ గుంతలు, కంకర తేలి వర్షపునీరు నిలిచిపోయి

రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రోడ్ల దుస్థితి

వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బందిగా ఉంది. ఏ గుంత ఎక్కడ ఉందో తెలియక పిల్లలు, వృద్ధులు పడిపోయి దెబ్బలు తినేపరిస్థితి. యర్రమరెడ్డిపాలెం వెళ్లే గ్రామస్తులైతే గ్రామానికి వెళ్లాలంటే ఫ్యాక్టరీల కొండంతరా వెళ్లాల్సిందే. ఇదే తనువుగా వర్షం వస్తే పరిశ్రమల వ్యర్థాలు రోడ్లపైకి రావడంతో జబ్బులు వచ్చే ప్రమాదం లేకపోలేదు. తిరుచానూరు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న రహదారిలో అయితే పందులు స్వైరవిహారం చేస్తూ, బురదలో పొర్లుతూ ఉంటాయి. మొత్తం 130 పరిశ్రమల నుంచి కేవలం 20 లక్షల రూపాయలే ఆదాయం వస్తోందని, అందువల్ల రోడ్లు నిర్మించలేకపోతున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి 'ప్రజాశక్తి'కి వివరణ ఇవ్వడం గమనార్హం.

మహతిలో జరిగిన వార్షికోత్సవ సభలో విద్యార్థులకు పురస్కారాలు

ఘనంగా లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని లిటిల్ ఏంజెల్స్ హై స్కూల్ 44వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమాల్లో ఆ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ శ్వేతా రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను పాఠ్య, పాఠ్యేతర అంశాలలో ప్రోత్సహించాలన్నారు. సైన్టిస్ట్ థామస్ ఆల్వా ఎడిసన్ తన పరిశోధనలో అనేకసార్లు విఫలమైనప్పటికీ, ప్రయత్నాలను ఆపలేదన్నారు. బల్బును కనుక్కున్నారని గుర్తు చేశారు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ నైనా జైస్వాల్ మాట్లాడుతూ ఇష్టం లేని చదువు కష్టం, కష్టం లేని జీవితం నష్టం, రూపాయి కన్నా గుణం గొప్పది.. అన్నదానం ఆకలిని తీర్చుతుంది విద్యాదానం విజ్ఞానాన్ని పెంచుతుందని తెలిపారు. నేడు సమాజంలో ప్రాణం లేని సెల్‌ఫోన్‌తో రోజుకి 10 గంటలు గడుపుతున్నారని, తల్లితో కనీసం పది నిమిషాలు గడపలేరా అని ప్రశ్నించారు. విజయానికి ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమైనదో, ఆత్మవిశ్వాసానికి సాధన కూడా అంతే అవసరం అన్నారు. విద్యార్థులు గురువులు పట్ల గౌరవం కలిగి, మీ ప్రగతికి మీరే సోపానాలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థిని విద్యార్థులు అందరిని అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత రాజగోపాల్ రెడ్డి, రమాదేవి, అరవింద రెడ్డి, పద్మశ్రీ, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్లో కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ తిరుపతి భాగస్వామ్యంతో ఈనెల 24, 25 తేదీలలో 40 మంది నిరుపేద పిల్లల కోసం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు తహ సున్నిసా బేగం తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం తిరుపతి కంప్యూటర్లు, వాటి అప్లికేషన్లు అవగాహన లేని పిల్లల కోసం కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ డిజిటల్ యుగంలో చాలామంది గ్రామీణ పిల్లలు సామాజికంగా వెనుకబడిన పిల్లలు కంప్యూటర్ల వాటి విస్తరణ పై అప్లికేషన్లు ప్రపంచాన్ని ఎలా మార్చారు అనే దాని గురించి ప్రాథమిక ఆలోచన లేదు .తిరుపతిలోని అనాథ శరణాలయానికి చెందిన సుమారు 40 మంది నిరుపేద పిల్లలకు శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పిల్లలకు మధ్యాహ్న భోజనంతో పాటు సర్టిఫికెట్లు అండ్ సైన్స్ బొమ్మలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉయ్ సపోర్ట్ చారిటబుల్ సభ్యులు రాజ్ కుమార్, నాదముని, లతా, సాగరిక, అంకయ్య వే ఫౌండేషన్ పాల్గొన్నారు.

రూ.22 లక్షల సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఐదుగురు లబ్ధిదారులకు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకటమణి ప్రసాద్(నాని) పంపిణీ చేశారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ రిసార్ట్స్ లోని నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాలకు చెందిన ఐదుగురు బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సీఎం సహాయనిధికి దరఖాస్తులు చేసుకున్న బాధితుల వివరాలను సీఎం చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధిని మంజూరు చేయించారు. రామచంద్రాపురం మండలం మిట్ట కండ్రిగ గ్రామానికి చెందిన కారేటి రామకష్ణారెడ్డికి రూ.89,424, జి రమాదేవికి రూ. 51,300, పి రవికి రూ.43,800 రూపాయలు, తిరుపతి రూరల్ మండలం సాయి నగర్ కు చెందిన పసుపులేటి వెంకటకష్ణ వంశీ కి రూ.1,500,000,, తుడా క్వాటర్స్ కు చెందిన మదన శేఖర్ కు రూ.4,16954 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్కల మహేష్ నాయుడు, తులసి నాయుడు, సురేంద్ర నాయుడు, మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

కనురెప్పల మాటున కన్నీళ్లు

బిడ్డలకు కొలోడియన్ బేబీ సిండ్రోమ్ వ్యాధి

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

రెవెన్యూ సదస్సులో వెలుగులోకి...

బిడ్డలకు అందమైన, అభివృద్ధికరమైన జీవితం ఇవ్వాలని ప్రతి తల్లిదండ్రీ అనుకుంటారు.. కానీ అనుకోకుండా వచ్చే దీర్ఘకాలిక వ్యాధులతో కళ్లెదుటే బిడ్డలు ఇబ్బంది పడుతుంటే ఆ మానసిక క్షోభ చెప్పలేం. కనురెప్పల మాటున కన్నీళ్లు దాచుకోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ప్రస్తుతం ఉడతా వెంకట సుబ్బయ్య, భార్య సుజాతల పరిస్థితి ఇదే. నయం కాని పరిస్థితి ఓ వైపుంటే, మరోవైపు ప్రతి నెలా 5వేల రూపాయలు పైనే మందులకు ఖర్చు అవుతుండటం గమనార్హం. సాయం చేయాలనుకున్న ధర్మదాతలు ఎవరైనా ఉంటే ఫోన్ పే నెంబర్ :9963672368కు ఆర్థిక సాయం చేయాలని తండ్రి వెంకటసుబ్బయ్య కోరుతున్నారు. తల్లిదండ్రుల వివరాల మేరకు...

కోట మండలం కర్లపూడి పంచాయతీలో బీసీ కులానికి చెందిన ఉడతా వెంకట సుబ్బయ్య, భార్య సుజాతలకు ముగ్గురు సంతానం. మొదటి సంతానం స్రవంతి. ఆ కుమార్తెకు ఎలాంటి అనారోగ్యం లేకుండా ఆరోగ్యకరంగా ఉంది. రెండో సంతానంగా కుమారుడు నాగరాజు (11) జన్మించాడు. నాలుగో తరగతి చదువుతున్నాడు. మూడో సంతానంలో హర్ష (7) ఒకటో తరగతి చదువుతున్నాడు. మగపిల్లలు ఇద్దరూ కొలోడియన్ బేబీ అనే సిండ్రోమ్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. శరీరం మొత్తం బిగుసుగా ఉండటం, నల్లగా తయారవడం, తల నుంచికాళ్ల వరకూ పగుళ్లు ఉండటం, వానా కాలం, ఎండాకాలంలో శరీరం సహకరించకపోవడంతో బిడ్డలు పడే బాధ వర్ణనాతీతం. ఈ వ్యాధి అరుదుగా పుట్టుకతో వచ్చే రుగ్మత. ప్రస్తుతం ఈ వ్యాధి ఉన్నట్లు, ఇలా వ్యాధి సంభవించిన వ్యక్తి శరీరంలో ముఖకవళికల్లో మార్పులు ఉండటాన్ని కర్లపూడి గ్రామంలో ప్రత్యక్షంగా అధికారులు చూశారు. సాధారణ వ్యాధులతో ఉండేవారు ప్రతిచోటా కనిపిస్తుంటారు. కానీ ఇలా అరుదైన వ్యాధిగ్రస్తులను చూడటం ఇదే మొదటిసారని రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు అచ్చెరువొందారు. సాధారణంగా సినిమాల్లో ఇలాంటి రకరకాల వ్యాధులతో బాధపడేవారిని చూస్తుంటామని, ప్రత్యక్షంగా చూడటం ఇదేనని సదస్సుకు వచ్చిన వారు అనుకోవడం కనిపించింది. వీరికి ప్రతి నెలా మందుల ఖర్చులే 5వేల రూపాయలు అవుతుందని తల్లిదండ్రులు వాపోయారు. రెవెన్యూ సదస్సుల్లో బిడ్డల ఆరోగ్య పరిస్థితిని చూసిన తహశీల్దార్ మనస్సు చలించి తక్షణమే మందుల ఖర్చు నిమిత్తం ఐదువేల రూపాయలను ఆ కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. ఏదిఏమైనా అరుదైన వ్యాధితో బాధపడే బిడ్డలకు బాసటగా దాతలు, ప్రభుత్వం ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(ప్రజాశక్తి - కోట)

7న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జనవరి 7న ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6వ తేది సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని టీటీడీకి సహకరించాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కొలువులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ పరిధిలోని మండలాలలో ఉన్న అంగన్ న్వాడి కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ, మినీ అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని చంద్రగిరి సిడిపిఓ ప్రదీప బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 23 నుంచి జనవరి 06 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాల కోసం ప్రాజెక్ట్ అధికారిని సంప్రదించాలని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగోన్నతులపై 'ఫోర్టో' నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్‌సిటి నిబంధనలకు విరుద్ధంగా సర్వీసులో ఒక్కసారి కూడా పాఠాలు చెప్పని నాన్ టీచింగ్ సిబ్బందిని జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగోన్నతి కల్పించడం బాధాకరమని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) బుధవారం నిరసన తెలిపింది. ఉత్తర్వులను దహనం చేశారు. ఫోర్టో జిల్లా చైర్మన్ దొడ్డ ఉమామహేశ్వర్ ,సెక్రటరీ జనరల్ పిల్ల పాలెం మునిరత్నం మాట్లాడుతూ ఇప్పటికే ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాల అంటే తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా చేశారని, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు లక్షల మంది ఉన్నా వారిని పదోన్నతి ద్వారా జూనియర్ కళాశాలకు తీసుకోకుండా కేవలం ఒక జీవో ని అడ్డం పెట్టుకొని గెజిటెడ్ హోదా కలిగిన జూనియర్ లెక్చరర్ పోస్ట్ కు పదోన్నతులు ఇవ్వడం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పతనానికి తర్కానంగా పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్ పోస్టుకు గ్రాడ్యుయేషన్ తో పాటుగా బీఈడీ తప్పనిసరిగా చేసి ఉండాలనే నిబంధనను పాటించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్టో నాయకులు సి. విశ్వనాథం, ఎం. శ్రీరాములు, చంద్ర ఈశ్వరయ్య, కె. వాసు దేవయ్య పాల్గొన్నారు

దళారుల అడ్డాగా ముక్కంటి క్షేత్రం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయం దళారీ వ్యవస్థకు రహదారిగా మారింది. అధికారం మారినా.. అధికారులు మారినా ఆలయంలో దళారీ వ్యవస్థకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. దీంతో పలుకుబడి కలిగిన దళారీలు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. గతంలో ఆలయ నాలుగో గేటు నుంచి ఈవో కార్యాలయానికి సమీపంలోని ఆర్చి ద్వారా వీఐపీ వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే నేడు వాహనాల అనుమతి దళారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. వారి పేరు చెప్తే భద్రతా సిబ్బంది వాహనాలను లోనికి అనుమతించాల్సిందే. లేకుంటే వారికి ఇబ్బందులు తప్పవు. పీఆర్ఓ కార్యాలయం కేంద్రంగా దళారులు చక్రం తిప్పుతున్నారు. అధికారులు మారిన సందర్భంగా విధానాలు కూడా మారుతున్నాయి. వీటిని ఆసరా చేసుకుని దళారులు రెచ్చిపోతున్నారు. చంద్రశేఖర్ ఆజాద్ ఇన్చార్జి ఈవోగా ఉన్న సమయంలో వాహనాలను పరిమితం చేశారు. ద్వి చక్ర వాహనాలను పూర్తిగా నిషేధించారు. దేవస్థానం, అధికారులు సిబ్బంది కూడా ద్విచక్ర వాహనాల్లో రాకూడదని ఆంక్షలు విధించారు. ఆలయ అధికారులు, ప్రముఖుల కార్లను మాత్రమే అనుమతించారు. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అన్ని రకాల వాహనాలు ఈవో కార్యాలయం వరకు వచ్చి వెళుతున్నాయి. వీరిని ఆపడం ఎవరివల్ల కావడం లేదు. భద్రతా సిబ్బంది ఆపితే బెదిరింపులు వస్తున్నాయి. దీంతో వారు తమకు ఎందుకులే అని అన్ని వాహనాలను లోనికి పంపిస్తున్నారు. రేకుల షెడ్డులో వాహనాలను ఇష్టం వచ్చిన విధంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. భక్తులకు ప్రమాదాలు కూడా జరిగాయి. ప్రమాదాలు జరిగిన రెండు రోజులు

అధికారులు హడావుడి చేస్తారు. ఆ తర్వాత సాధారణ స్థితి. వాహనాల రాకపోకలపై నియంత్రణ లేదు. జ్ఞాన ప్రసూనాంబ వసతి గహానికి వెళ్లే భక్తులు, ప్రముఖుల వాహనాలను బూడిదమిట్ట గేటు ద్వారా అనుమతిస్తే ఇబ్బందులు తప్పుతాయని భక్తులు అంటున్నారు. దేవస్థానం అధికారులకు, వీవీఐపీలకు మాత్రమే సన్నిధివీధి ఆర్చి ద్వారా అనుమతిస్తే భక్తులకు ఇబ్బందులుండవు. అంతేగాకుండా ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధించాలి. పిఆర్ఓ కార్యాలయం కేంద్రంగా చేసుకున్న కొందరు దళారులు వాహనాలను లోపలికి తీసుకెళ్లడానికి సిబ్బందిపై దౌర్జన్యం చేస్తున్నారు. కూటమి పార్టీల నాయకుల పేర్లు చెప్పి వాహనాలను పంపాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. వాహనాలను పంపకుంటే ఫలానా నాయకుడికి చెబుతామంటూ బెదిరిస్తున్నారు. దీనిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

తత్కాల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ నందు పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటించిన తత్కాల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సంచాలకులు పలువురు చేసిన విజ్ఞప్తి మేరకు డిసెంబర్ 26వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు తత్కాల్ నందు గడువు ఇచ్చారని చెప్పారు. సాధారణ అడ్మిషన్ ఫీజుకు అదనంగా 600 రూపాయలు తత్కాల్ ఫీజుగా చెల్లించి ఓపెన్ స్కూల్ నందు ప్రవేశము పొందవచ్చన్నారు. 2024 -25 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఇదే ఆఖరి అవకాశంగా తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రవేశాలను ఏపీ ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చున్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమాని ప్రాణాలు కాపాడుకున్నాం: కృష్ణ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తీవ్రమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాని కౌశిక్ ప్రాణాలు కాపాడడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని మాటిచ్చి ప్రాణాలు కాపాడామని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాని కౌశిక్ క్యాన్సర్ వ్యాధితో తన కుమారుడు బాధపడుతున్నాడని, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల్ని తెలుసుకొని టీటీడీ నుండి 40 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 11 లక్షలు, టిటిడి ఉద్యోగులు 10 లక్షల రూపాయల వరకు ఆపరేషన్ కు అవసరమైన నగదును సమకూర్చారన్నారు. అయితే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో చెన్నై ఆసుపత్రిలో వైద్యానికి సరిపడా నగదు చెల్లించకపోవడంతో ఆసుపత్రి యాజమాన్యం కౌశిక్ ను డిశ్చార్జి చేయలేదన్నారు. డిశ్చార్జ్ అయిన తర్వాత మందుల అవసరాలకు సరిపడా నగదు కోసం మీడియా ముందుకు కౌశిక్ తల్లి వచ్చిందని, ఎన్టీఆర్ అభిమానులు అందరూ కలిసి కౌశిక్ కు అవసరమైన మందులకు తగిన సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం కన్వీనర్లు మురళి, వరదారెడ్డి, రాజేష్, నాని, జానకిరామ్, సోము, నందా పాల్గొన్నారు.

గదుల డిపాజిట్ రిఫండ్‌పై విచారణ చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గత వైసిపి ప్రభుత్వ హయాంలో 2022 నుండి తిరుమలకు వచ్చిన శ్రీవారి భక్తులకు, యాత్రికులకు గదుల కేటాయింపు జరిపే సమయంలో టీటీడీ వసూలు చేసే కాషన్ డిపాజిట్ రిఫండ్ పై భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరిపించాలని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గదులు పొందిన వారికి నగదు వారి బ్యాంకు ఖాతాకే నేరుగా జమ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారని, కానీ చాలావరకు నగదు జమ కాకుండా భక్తులు విమర్శలు చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆనాడు దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రయత్నించగా తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. ఈ అవకతవకల నగదు మొత్తం మాజీ ముఖ్యమంత్రి జగన్ ఖాతాకు బదిలీ అయిందని ఆరోపించారు. ఈ కాషన్ డిపాజిట్ రీఫండ్ లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని టిటిడి చైర్మన్ కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సుమన్, మనోజ్ పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో బంజారా సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఈనెల 27, 28 తేదీలలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో బంజారా జన్ సంఘ్ ఆధ్వర్యంలో గిరిజన జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బంజారా జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరి చౌహన్ నాయక్ కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఈ సాంస్కృతిక కార్యక్రమాల గోడ పత్రికలను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజ్ గౌడ్ తో కలసి ఆవిష్కరించారు. మొట్టమొదటిసారి తిరుమల శ్రీవారి పరమ భక్తుడైన హాథీరాం బావాజీ విశిష్టతను తెలియజేస్తూ రెండు రోజులపాటు పౌరాణిక సాంఘిక నాటికలు, ఆధ్యాత్మిక సంగీత సంకీర్తనాలాపనలు, జానపద నత్యాలు నిర్వహిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వెంకటేష్, వినోద్, రమేష్ బాబు, సీతారాం, కిషోర్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్

స్థానిక తిరుపతి వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం పోటి పరీక్షల సమాచార కేంద్రంలో 2025 - 2026 విద్యా సంవత్సరమునకు జాతీయ స్థాయి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ద్వారా 6వ తరగతి, 9వ తరగతి ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను 13 జనవరి 2025 వరకు సమర్పించవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. దేశస్థాయిలో ప్రవేశ పరీక్షను 190 నగరాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తుల సమాచారం, నమూనా పరీక్షల కోసం విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కొరకు 8688888802 ,03 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని చెప్పారు.

తిరుపతిలో ఎస్ఎస్‌డి టైంస్లాట్ కౌంటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుమల

తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనాల ఎస్ఎస్‌డి టైం స్లాట్ టోకెన్లు జారీ కౌంటర్లను టిటిడి ఈవో శ్యామలరావు, కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు పరిశీలించారు. జనవరి 10-19 తేదీలోల వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించనున్నారు. జనవరి 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి టోకెన్ల జారీ ప్రక్రియను ప్రారంభిస్తారు. 10-12 తేదీల్లో లక్షా 20వేల టోకెన్లు జారీ చేస్తారు. మిగిలిన ఏడు రోజులకు ముందు రోజు మాత్రమే రెగ్యులర్ ఎస్ఎస్‌డి టైంస్లాట్ టోకోన్లు జారీ చేయనున్నారు. టోకెన్ల జారీకి తిరుపతి, తిరుమలలో 9 కేంద్రాల్లో91 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. గోవిందమాల భక్తులకు ఎటువంటి ప్రత్యేక టికెట్లను జారీ చేయడం లేదని ఈవో శ్యామలరావు తెలిపారు.

టీటీడీకి రూ.1.11 కోట్లు విరాళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈఓ పి.ఎం.ఎస్.ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

మా రోడ్డు మా ఇష్టం..

- **ప్రతిపక్ష చోటా నాయకుని బిల్డప్**
- **ఏటవాలుగా రహదారి ఏర్పాటు**

ప్రజాశక్తి - కోట

ముఖ్యమంత్రి ఆదేశాలతో రహదారుల పనులు గ్రామాల్లోనూ చురుగ్గా సాగుతున్నాయి. అయితే కాంట్రాక్టర్లు, అధికారుల ప్రమేయం కంటే 'స్థానిక' రాజకీయనాయకుల ప్రమేయం ఎక్కువగా కనిపిస్తోంది. గూడూరు నియోజకవర్గం పరిధిలో ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిసి రోడ్లను చురుగ్గా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలోని విజయ కాలనీలో రూ.5 లక్షలతో సిసి రోడ్డును ఇద్దరు కాంట్రాక్టర్లు నిర్మించేందుకు ఒప్పుకున్నారు. ముందుగా ఎత్తుపల్లాలు లేకుండా గ్రావెల్ మట్టితో చదును చేశారు. అయితే తెల్లారేసరికల్లా రోడ్డు పక్కనే నివాసం ఉండే ప్రతిపక్ష చోటా నాయకులు కల్పించుకుని కాంట్రాక్టర్లు వచ్చేసరికి జేసీబీతో రోడ్డు ఏటవాలుగా ఉండాలని స్వంత నిర్ణయంతో నిర్మాణ రూపురేఖలను మార్చేశారు. కాంట్రాక్టర్లు తోలిన గ్రావెల్ మట్టిని ఏకపక్షంగా ఓ ప్రతిపక్ష చోటా నాయకుడు దగ్గరుండి జేసీబీతో తొలగించడంతో రోడ్డు ఏటవాలుగా తయారయ్యింది. తొలగించిన ఆ గ్రావెల్ మట్టిని ప్రస్తుతం భరంచల్‌కు వాడుకోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకులు రోడ్డు నిర్మాణం వద్దకు వచ్చి ఏటవాలుగా ఉండటం చూసి కొండ ప్రాంతాల్లో రోడ్డు వేసినట్లు ఉందనడంతో కొంతసేపు స్థానిక ప్రతిపక్ష నాయకులతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఏటవాలుగా రోడ్డు ఉండడంతో పల్లంగా ఉండే ఇళ్ల వద్ద వారి పరిస్థితి ఏంటని స్థానికుల్లో అసహనం నెలకొంది. ఇంత జరుగుతున్నా పంచాయతీరాజ్ అధికారులు మౌనంగా ఉండిపోయారు. రోడ్డు మార్జిన్ కూడా చూసుకోకుండా కొంతమంది ఇళ్లముందు ప్లాట్‌ఫారాలనూ జేసీబీలతో తొలగించడంతో ఆయా ఇంటి యజమానులు భావోద్వేగానికి గురయ్యారు. 'స్థానికంగా' రోడ్డు నిర్మాణంపై 'స్థానికుల్లో' అసహనం వ్యక్తమైనా అధికారులు విచారించకపోవడం గమనార్హం. నిబంధనలకు అనుకూలంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా నింపే భరంచల్ మట్టిని సైతం సరిగ్గా చదును చేయకపోవడంతో వారివారి ఇంటిముందు ఆ ఇంటి యజమానే చదును చేసుకునే పరిస్థితి నెలకొంది.

ఇళ్లముందు చదును చేసుకుంటున్న స్థానికులు

అన్నమయ్య ఘటనపై... పలు కోణాల్లో దర్యాప్తు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాయలచెరువు రోడ్డు కూడలిలో అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టిన ఘటనపై ఎంఆర్‌పల్లి పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ఈస్టు పోలీసు స్టేషన్‌లోని సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు పాల్పడింది బిక్షగాడని పోలీసులు మంగళవారమే తేల్చారు. అన్నమయ్య సర్కిల్లో సిగ్నల్ పడినపుడు వాహనాల వద్ద పెన్నులు, చెవి బడ్స్ అమ్ముకునే వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఈ ఘటన పైన హిందూ సంఘాలు, స్వామీజీలు, బజరంగ్ దళ్ కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు దిగి తిరుమల శ్రీవారి పరమ భక్తుడైన అన్నమయ్య విగ్రహానికి ఇలా శాంతాక్లాజ్ టోపీ పెట్టి అపచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లౌకికవాదులైతే తిరుమల తిరుపతి వేదికగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని హితవు పలికారు. రంగంలోకి దిగిన పోలీసులు అసలు అక్కడ ఏం జరిగింది అన్నది సిసిటివి ఫుటేజ్ ను పరిశీలించారు.

సిసి కెమెరా దృశ్యం

అన్ని కోణాల్లోనూ దర్యాప్తు

అతడు తెలిసీ తెలియక శాంతాక్లాజ్ టోపీ అన్నమయ్యకు పెట్టాడా లేక, పెట్టడానికి ఎవరైనా అతనిని ప్రోత్సహించారా అన్న కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంలో ఎవరు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇదే సమయంలో పురప్రజలు సంయమనం పాటించాలని సూచిస్తున్నారు. క్రిస్మస్ పండుగకు ముందు రోజు జరిగిన ఈ ఘటన నేపథ్యంలో మత విద్వేషాలు రగలకుండా తిరుపతిలో పోలీసులు చర్యలు తీసుకున్నారు.

చెన్నయ్ ఎస్ఆర్ఎంకు 'యువతరంగ్' జట్టు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక సంబంధాల విభాగం (డిఎస్డబ్ల్యుసిఎ) నేతత్వంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నందు దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల సాంస్కృతిక కార్యక్రమాల పోటీలో పాల్గొనేందుకు యువతరంగ్ జట్టు పయనమయ్యింది. ఈ సాంస్కృతిక పోటీలో పాల్గొనేందుకు వర్సిటీ యువతరంగ్ 2024 నందు అద్భుత ప్రదర్శన చేసిన యువ కళాకారుల బందం బుధవారం మధ్యాహ్నం చెన్నైకి బయలుదేరి వెళ్ళింది. ఆ సాంస్కృతిక పోటీలన్నింటిలో ఎస్వీయూ పాల్గొననుంది. వర్సిటీ ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు శుభాకాంక్షలు తెలుపుతూ, పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. డిఎస్డబ్ల్యుసిఎ డైరెక్టర్ ఆచార్య బివి మురళీధర్ మాట్లాడుతూ ఎస్వియూ విద్యార్థులు నూతన ఉత్తేజంతో ఈ పోటీలలో పాల్గొనేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారని వెల్లడించారు. గత 15 రోజులుగా వర్సిటీలోని అన్నమయ్య భవన్లో విద్యార్థులు నిపుణులైన శిక్షకుల ద్వారా ప్రాక్టీస్ చేశారని అన్నారు. చెన్నైలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విద్యార్థులు కచ్చితంగా విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తనకు పూర్తిగా నమ్మకంలోని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్డబ్ల్యుసిఎ కో ఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్ చౌదరి పాల్గొన్నారు.

ముగిసిన బ్యూటీషియన్ శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పది రోజుల బ్యూటీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక వెంకటపతినగర్ లోని మహిళలకు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ టి.చైతన్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో ఆదరణ ఉన్న బ్యూటీషియన్ కోర్సు నందు నేర్చుకున్న స్కిల్స్‌ను తమ దైనందిన జీవితంలో కొనసాగిస్తూ ఉండాలని, ఈ వత్తిని ఉపాధిగా ఎంచుకున్న మహిళలు తమకు అనుకూలంగా ఉండే సమయంలోనే కొనసాగిస్తూ స్వయం ఉపాధి సాధించవచ్చని అన్నారు. బ్యూటీషియన్ లో స్కిల్స్ పూర్తిగా నేర్చుకుని ఇతరులకు ఉపాధి అవకాశాలు ఇచ్చే స్థాయికి ఎదిగిన వారు చాలామంది ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యూటీషియన్ ట్రైనర్ కే.నిరోష, అధ్యయనకేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎం. ఇంద్రాణి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్! డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -పుంగనూరు

విద్యార్థి ఫైల్‌ఫొటో

డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్ గేములకు అలవాటు పడి బాగా డబ్బులు పోగొట్టుకున్నాడు. దీన్ని గమనించిన అతని తల్లిదండ్రులు మందలించి సెల్ ఫోన్‌ను లాక్కోవడంతో నిరాశ చెందిన విద్యార్థి కోనేరులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుంగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. పుంగనూరు పట్టణంలో వుంటున్న రెడ్డప్ప కుమారుడు శ్రీనివాసులు డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. శ్రీనివాసులు ఆన్‌లైన్ గేమ్‌లు అడుకుంటూ బాగా డబ్బులు పోగొట్టేవాడు. దీన్ని గమనించి ఇంట్లో తల్లిదండ్రులు మందలించి మంగళవారం రాత్రి తన వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కోవడంతో ఆ బాధను తట్టుకోలేక రాత్రి కోనేరు సమీపంలో పైన చెప్పులు వదిలేసి మెట్లపై కూర్చున్నాడు. ఇది గమనించిన కొంత మంది 'ఇక్కడ నుండి వెళ్లిపో' అని వారించారు. ఇది విని శ్రీనివాసులు వెళ్లినట్టు వెళ్లి మళ్లీ అక్కడికి వచ్చి అదశ్యమయ్యాడు. మెట్లపై చెప్పులను చూసిన కొంతమంది తల్లిదండ్రులకు చెప్పడంతో వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపులో శ్రీనివాసులు విగతజీవిగా బయటపడ్డాడు. పట్టణ పరిసరాల నుండి వందలాది మంది ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షేక్ హాసినాకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వియూ సైన్స్ కళాశాల గణిత విభాగం పరిశోధక విద్యార్థి షేక్ హాసినాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గణిత విభాగాధ్యక్షులు ఆచార్య సి. జయసుబ్బారెడ్డి మార్గదర్శకత్వములో " సమ్ స్టడీస్ ఆన్ (ఆల్ఫా, వన్) రివర్స్ డెరివేషన్స్ ఇన్ రింగ్స్ " అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. హసీనా పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు.

చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఇసుక కోసం స్వర్ణముఖి నదిలోకి దిగిన ఎడ్ల బండి నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా, ఓ ఎద్దు ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన మంగళవారం శ్రీకాళహస్తి రూరల్ మండలం పరిధిలోని బూరగమానుకండ్రిగ వద్ద చోటు చేసుకుంది. బాధితుడు చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. వివరాల్లోకి పోతే..శ్రీకాళహస్తి పట్టణంలోని ఏఎంపుత్తూరుకు చెందిన కళత్తూరు చంద్రయ్యది నిరుపేద కుటుంబం. ఎడ్ల బండి సాయంతో కూలీనాలీ పనులు చేసుకుంటూ రోజువారీ కూలీగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బూరగమానుకండ్రిగ వద్ద ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తీసుకొచ్చేందుకు డిగ్రీ చదువుతున్న కుమారుడు మునిబాలాజీతో కలిసి వెళ్ళాడు. నదిలోని ఇసుక మేట వద్దకు చేరుకునే క్రమంలో నీటి ప్రవాహాన్ని అంచనా వేయక ఉదతికి ఎడ్ల బండి కొట్టుకుపోయింది. ప్రవాహ వేగానికి ఎడ్ల బండి ఫల్టీలు కొట్టడంతో కాడెకు ఉన్న ఎద్దుల్లో ఒకటి మరణించింది. తండ్రీ కొడుకులకు ఈత రావడంతో ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. స్థానికుల సాయంతో బండిని కూడా ఒడ్డుకు చేర్చారు. తమ ఉపాధికి జీవనాధారమైన ఎద్దును కోల్పోవడంతో నది వద్ద చంద్రయ్య కన్నీరుమున్నీరై విలపించడం అందర్నీ కలచి వేసింది.

ప్రభుత్వం ఆదుకోవాలి: అంగేరి పుల్లయ్య

ఇసుక కోసం వెళ్లి జీవనాధారమైన ఎద్దును కోల్పోయిన చంద్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య కోరారు. కాడెద్దుల విలువ రూ. 1.20 లక్షలు కాగా మరో ఎద్దును కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత చంద్రయ్య వద్ద లేదన్నారు. చంద్రయ్య లాగే మరో వంద కుటుంబాల వరకు పట్టణంలో ఎడ్ల బండ్లను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వర్షాలు, నదిలో నీటి ప్రవాహం తగ్గే వరకు వారికి ఇల్లు గడవడం కష్టతరమవుతుందన్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం భతి కల్పించాలని కోరారు.

క్రైం న్యూస్

కరెంటు షాక్‌తో సాగునీటి సంఘం అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



వడమాలపేట మండలం కల్లూరు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు రఘురామయ్య. వ్యవసాయ పొలం వద్ద. మోటర్ వేయడానికి వెళ్లి. కరెంట్ షాక్‌తో మృతి చెందారు. పొలం వద్ద మోటార్ వేయడానికి వెళ్లి కరెంటు షాక్ కు గురై అక్కడికక్కడే మరణించారు. ఆయన. మృతి పట్ల నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సంతాపం ప్రకటించారు.

కూచువారిపల్లెలో దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

చంద్రగిరి మండలం కూచివారిపల్లిలో భార్యభర్త ఇరువురూ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు విషయాన్ని తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామిరెడ్డిపల్లి పంచాయితీ కూచువారి పల్లికి చెందిన సురేందర్ నాయుడు (50), లత (45) దంపతులు తిరుపతిలో కాపురం ఉన్నారు. సురేందర్ నాయుడు తిరుపతి లోని ట్రాన్స్కో లో లైన్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్నాడు. భార్యాభర్త బుధవారం తిరుపతి నుంచి సొంత గ్రామమైన కూచి వారి పల్లి కి వచ్చారు. పొలం వద్దకు వెళ్లారు. పొలం వద్ద మామిడి చెట్టుకి ఉరి వేసుకుని వేలాడుతూ విగత జీవులుగా కనబడ్డారు. వీరికి వివాహమైన కుమార్తెలు ఇద్దరు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు విదేశాలలో స్థిరపడ్డట్లు సమాచారం. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మతదేహాలకు శవ పంచానామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఆత్మహత్య కు సంబంధించి ఎలాంటి విషయాలు తెలియ రాలేదని తెలుస్తోంది.సురేంద్ర నాయుడుకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు, కుటుంబ కలహాలు లేవని స్థానికులు వెల్లడిస్తున్నారు.ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

సిఎం దృష్టికి పరకామణి ఉద్యోగి స్కాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో 2023లో విధులు నిర్వహించిన రవికుమార్ అనే వ్యక్తి భక్తులు సమర్పించే కానుకలను కాజేసిన కేసు విషయంలో కోట్ల రూపాయలు చేతులు మారాయని, లోక్ అదాలత్‌లో ఈ కేసును రద్దు చేసుకునేలా ఆనాటి టిటిడి ఉన్నతాధికారులు, గత ప్రభుత్వ పెద్దలు వ్యవహరించారని టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఈ కుంభకోణంపై సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానన్నారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని మంగళం పోలీస్ అవుట్ పోస్టు సమీపంలో ఉన్న పసుపర్తి పనోరమ అపార్ట్మెంట్లో రవికుమార్ కొని టీటీడీకి గిఫ్ట్ డీడ్ కింద రాసిచ్చిన 14 ఫ్లాట్ లను భాను ప్రకాష్ రెడ్డి సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఈ పరకామణి డాలర్ల దొంగతనం కేసు వెనుక గత ప్రభుత్వ పెద్దలు ఉన్నారని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిజాలు శ్రీవారి భక్తులకు తెలిసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రేపు వాలీబాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏపీ క్రీడా అధికార సంస్థ ఆధ్వర్యంలో వాలీబాల్ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, స్త్రీల జట్ల ఎంపికను ఈనెల 27వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివద్ధికారి సయ్యద్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 27వ తేదీ ఉదయం ఏడు గంటలకు తమ ధృవీకరణ పత్రాలతో, 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన రాష్ట్ర జట్టు జనవరి 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ లో జరుగు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జె.పి క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పాస్ట్ రీజియన్ చైర్మెన్ ఆర్.వి .రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా తమ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గోపీనాథ్ రెడ్డి , సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE ::PUTTUR
IA.NO. 349/2023, O.S.No. 216/2023

Between :
K.Raja Reddy .... Petitioner/Plaintiff
And:
1. K. Nadipi Reddy and others ....Respondents/Defendants

NOTICE TO THE RESPONDENTS NO.1

To 1. K. Nadipi Reddy, S/o. Late Budda Reddy @Chinnma Reddy, Hindu, aged about 75 years, Residing at D.No. 5-72, Rekalachenu Village, Bopparajupalli Post, Ramachandrapuram Mandal, Tirupati district., ...Respondent No.1

Please take notice that the petitioner/ plaintiff filed the above case against you, for permanent injunction by the petitioner/plaintiff same is posted to 31-12-2024, for your notice. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 31-12-2024, either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided exparte.

Sri. N. Nadhamuni, LLM., Advocate, Puttur.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE ::PUTTUR
O.S.No. 216/2023

Between :
K. Raja Reddy .... Petitioner/Plaintiff
And:
1. K. Nadipi Reddy and others ....Respondents/Defendants

NOTICE TO THE RESPONDENTS NO.1

To 1. K. Nadipi Reddy, S/o. Late Budda Reddy @Chinnma Reddy, Hindu, aged about 75 years, Residing at D.No. 5-72, Rekalachenu Village, Bopparajupalli Post, Ramachandrapuram Mandal, Tirupati district., ...Respondent No.1

Please take notice that the petitioner/ plaintiff filed the above case against you, for permanent injunction by the petitioner/plaintiff same is posted to 31-12-2024, for your notice. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 31-12-2024, either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided exparte.

Sri. N. Nadhamuni, LLM., Advocate, Puttur.